ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.32 (0.39)	నిల్	నిల్

చికెన్ ధరలు: లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.204 | స్కిన్‌లెస్ : రూ.234

● పోరుబాట



స్టైఫండ్‌ను నెలనెలా చెల్లించాలని, మెడికల్ కళాశాలలో అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని, నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు సోమవారం విధులను బహిష్కరించారు. అత్యవసర సేవలను మినహాయించి వార్డు, ఓపీ, ఇతర సేవలను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు.

•7లో..



డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలని, గ్రూప్-2, 3లో పోస్టుల సంఖ్య పెంచాలని, గ్రూప్-1లో 1:10 ప్రకారం అభ్యర్థులను మెయిన్స్ పరీక్షకు పిలవాలని, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సోమవారం నల్లగొండలో ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు స్థానిక సుభాష్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

•7లో..



అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్‌వాడీలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళనలు నిర్వహించారు. అంగన్ వాడీ టీచర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు.



చింతపల్లి మండలం కేంద్రంలో నిర్వహించిన 'ప్రజావాణి'లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి పోటెత్తారు

- మండల స్థాయిలో నిర్వహించడంతో తరలివచ్చిన ప్రజలు
- తొలి రోజే జిల్లా వ్యాప్తంగా 1,706దరఖాస్తులు
- రానున్న రోజుల్లో కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించే ఆలోచన
- ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశం

నల్లగొండ టౌన్, జూన్ 24: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజావాణి'కి నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వచ్చి ఫిర్యాదులు అందజేస్తున్నారు. సమస్యలు ఉన్నా కొంత మంది వ్యయ, ప్రయాసలకు తోడు దూరా భారంతో రాలేకపోతున్నారు. జిల్లా కేంద్రానికి వచ్చి 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేస్తే వాటిని ఆయా మండలాల అధికారులకు పంపి పరిష్కరించాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. తిరిగి ఫిర్యాదుదారులు మండల అధికారుల వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఇలా మండలానికి, జిల్లా కేంద్రానికి తిరగలేక పలువురు సమస్యలతోనే సావాసం చేస్తున్నారు. దీన్ని గుర్తించిన నూతన కలెక్టర్ సీ.నారాయణరెడ్డి 'ప్రజావాణి'పై దృష్టిసారించారు. మండలాల స్థాయిలోనే పటిష్టంగా 'ప్రజావాణి'ని నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పడంతోపాటు సమస్యలు త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉందని ఆలోచన చేశారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా సోమవారం మండలాల స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించా రు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన తొలిరోజే ఫిర్యాదు చేసేందుకు ప్రజలు పోటెత్తారు. జిల్లా వ్యాప్తంగా ఒక్క రోజులోనే 1,706 ఫిర్యాదులు మండల స్థాయి 'ప్రజావాణి'కి వచ్చాయి.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తొలిసారి మండలాల స్థాయిలో నిర్వహించిన 'ప్రజావాణి'కి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. జిల్లా స్థాయిలో 'ప్రజావాణి' నిర్వహిస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారం కావాలని, జిల్లా కేంద్రం వరకు ఫిర్యాదుదారులు రాకూడదన్న ఉద్దేశంతో కలెక్టర్ నారాయణరెడ్డి నూతన పంథాలో మండలాల స్థాయి 'ప్రజావాణి'కి శ్రీకారం చుట్టారు. ఇకపై ప్రతి సోమవారం 'ప్రజావాణి' నిర్వహించాలని వారం రోజులుగా చేస్తున్న కసరత్తు ఫలించింది. ఈమేరకు జిల్లా అధికారులను,మండలాల ప్రత్యేక అధికారులుగా నియమించడమేగాక, ప్రజావాణి నిర్వహణకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చారు. ఈ కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో ముందే శిక్షణఇవ్వడంతో తొలి రోజు సత్ఫలితాలు వచ్చాయి. మొదటి రోజే జిల్లా వ్యాప్తంగా 33 మండలాల్లో 1,706 దరఖాస్తులు వచ్చాయి.

సమస్యలకు మండలస్థాయిలోనే పరిష్కారం

సమస్యలకు మండలస్థాయిలోనే పరిష్కారం లభించాలని 'ప్రజావాణి'ని ప్రారంభించారు. ఏ ఒక్క దరఖాస్తు జిల్లా స్థాయికి నేరుగా రావద్దని, మండలానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుందనే నమ్మకం ప్రజల్లో కల్పించాలని ఇప్పటికే కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అంతేగాక అందుకు మండల స్థాయి బృందాలు బాధ్యులుగా ఉండనున్నాయి. ఏ మండలంలో అయితే 'ప్రజావాణి'కి దరఖాస్తులు తక్కువగా వచ్చాయో అక్కడ ఈ కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ నిర్ణయించారు. అందుకు క్షేత్రస్థాయి నుంచే కార్యాచరణ ప్రారంభించాలని భావించి సోమవారం ఉదయమే కలెక్టర్ గ్రామపంచాయతీ కార్యదర్శులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిచారు.

పథకాలకు దరఖాస్తు వేదిక

'ప్రజావాణి' కేవలం సమస్యలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కూడా తీసుకోవాలని కలెక్టర్ నిర్ణయించారు. పంచాయతీల వారీగా పథకాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తు తీసుకొని ఒక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ప్రభుత్వం ఆయా పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రకటించగానే ఎవరు అర్హులనేది ఆ రిజిస్టర్ ద్వారా తెలుస్తుంది. దీంతో లబ్ధిదారుల ఎంపిక సులువుకానుంది. మండల స్థాయిలో గ్రామాల వారీగా దరఖాస్తులను విభజించనున్నారు. ఈ కార్యక్రమంపై గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. అదేవిధంగా ప్రజలకు అర్థమయ్యేలా ప్రభుత్వ పథకాల సర్క్యులర్లను తెలుగులో జారీ చేయాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ, ఆశ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధి హామీ, ఐకేపీ, ఏసీడీఎస్, వైద్య ఆరోగ్య, వ్యవసాయం మొత్తం ఏడు శాఖల సిబ్బంది ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నారు.

వచ్చిన ఫిర్యాదులన్నింటిని శనివారంలోగా పరిష్కరించాలని, ఆన్‌లైన్‌లో సైతం వాటి పరిస్థితిని నమోదు చేయాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు.

మొత్తం 1,706 దరఖాస్తులు

మండలాల స్థాయిలో నిర్వహించిన 'ప్రజావాణి'కి సోమవారం జిల్లా వ్యాప్తంగా 1,706 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా చందంపేట మండలంలో 289 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా మర్రిగూడ మండలంలో ఐదు వచ్చాయి. అడవిదేవులపల్లి మండలంలో 232, గట్టుప్పల్‌లో 137, డిండిలో 83, దేవరకొండలో 72, చింతపల్లిలో 69, నిడమనూరులో 55, కొండమల్లేపల్లిలో 51, దామరచర్లలో 51, నాంపల్లిలో 49, మాడ్గులపల్లిలో 45, గుర్రంపోడులో 42, నకిరేకల్‌లో 42, చండూర్‌లో 39, నార్కెట్‌పల్లి 36, త్రిపురారంలో 33, మిర్యాలగూడలో 33, కేతేపల్లిలో 31, నల్లగొండలో 30, అనుముల 27, తిప్పర్తిలో 27, వేములపల్లిలో 23 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అధికంగా రెవెన్యూశాఖకు చెందిన దరఖాస్తులే ఉన్నాయి. రెవెన్యూశాఖకు చెందిన దరఖాస్తులు 910, అభివృద్ధి సంక్షేమ శాఖలకు చెందినవి 667, ఇతర శాఖలకు చెందిన దరఖాస్తులు 72 వరకు ఉన్నాయి.

సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలి : కలెక్టర్

చింతపల్లి, జూన్ 24: ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం చింతపల్లి, నాంపల్లి ఎంపీడీవో కార్యాలయాల్లో జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ సోమవారం 'ప్రజావాణి' నిర్వహించాలని, ప్రతీ ఫిర్యాదును క్షుణ్ణంగా చదివి వెంటనే పరిష్కారం అయ్యేవాటిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఫిర్యాదుదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. ప్రతీ సోమవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో రానున్న వారం, నెలలో చేయాల్సిన పనులపై చర్చించాలని సూచించారు. 'ప్రజాపాలన' పథకాల అమలు, 'ధరణి' సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి పాత్ర చాలా ముఖ్యమైందని, పంచాయతీలు మినీ కలెక్టరేట్‌లా పనిచేయాలన్నారు. పంచాయతీల్లో ఇతర పనులు సవ్యంగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రావొద్దన్నారు. పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులను పిలిచి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమాల్లో దేవరకొండ, చండూరు ఆర్డీవోలు శ్రీరాములు, డి.సుబ్రహ్మణ్యం, ప్రత్యేక అధికారులు సక్కుబాయి, శ్రీనివాస్, ఎంపీడీవోలు కరుణ మేరి కుమారి, సుజాత, తహసీల్దార్లు దశరథ సింగ్, విజయ్‌కుమార్, ఎంపీపీలు ఏడుదొడ్ల శ్వేత, భవాని, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో అక్రమబద్ధీకరణ?

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మందిపై ఫిర్యాదులు
- సర్టిఫికెట్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశం
- ఇప్పటికే విచారణ నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు



నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లోని పలు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీకి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

– నల్లగొండ

గత ప్రభుత్వం రాష్ట్రంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చర్లను క్రమబద్ధీకరించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది అర్హత లేకున్నా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగ క్రమబద్ధీకరణ పొందారనే ఆరోపణలు వచ్చాయి. అందులో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో ఏడుగురు, యాదాద్రి జిల్లాలో ఒకరు ఇలా నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఇంటర్ బోర్డుకు పలువురు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఆరోపణలపై విచారించిన ఇంటర్మీడియట్ విద్యామండలి ఇప్పటికే ఒక నివేదిక ప్రభుత్వానికి అందజేసినా మరోమారు విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్జేడీ) సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని నల్లగొండ, యాదాద్రి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులను (డీఐఈవో) ఆదేశించింది. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణకు ఆదేశించినట్టు ఆర్జేడీ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, నల్లగొండ జిల్లా హాలియా జూనియర్ కళాశాలలో ఒకరు, నల్లగొండలోని కేపీఎం జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న మరో అధ్యాపకుడితో పాటు అదే కళాశాలలో పనిచేస్తున్న ఇంకో అధ్యాపకుడు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఆరోపణలు ఉన్నాయి. నాగార్జునసాగర్ విజయపురి కళాశాలలో పనిచేస్తున్న ఒక లెక్చరర్‌తో పాటు నల్లగొండ బాలికల జూనియర్ కళాశాలలో ఒక లెక్చరర్, అదే కళాశాలలో పనిచేస్తున్న మరో ఇద్దరు లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఆర్జేడీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు సమర్పించిన సర్టిఫికెట్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ క్రమబద్ధీకరణపై సీఐడీ విభాగం విచారణ నిర్వహిస్తోంది. క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు డీఐఈవోలకు అందజేయాలని, వాటిని పరిశీలించి ఇస్తామని ఆర్జేడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మరి కొంతమంది ఇలా నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు చర్చ సాగుతోంది.

సర్టిఫికెట్లను కమిషనర్‌కు పంపించాం

నకిలీ సర్టిఫికెట్లతో కొందరు కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉద్యోగ క్రమబద్ధీకరణ పొందారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో వారి సర్టిఫికెట్లను పరిశీలన కోసం ఇంటర్ బోర్డు కమిషనర్‌కు పంపించాం. పూర్తి విచారణ అనంతరం రాష్ట్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారు. ఆరోపణలు ఎదుర్కొంటున వారిలో ఒకరు ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందారు.

– దస్రునాయక్, నల్లగొండ డీఐఈవో

అక్షరాస్యతను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలి



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐసీబీ బృందం

నల్లగొండ టౌన్, జూన్ 24 : రాష్ట్రంలో అక్షరాస్యతను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏఐసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు అన్నారు. ఈ మేరకు ఏఐసీబీ సీఈసీ సభ్యుడు స్వామినాయక్‌తో పాటు ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కే రాములు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలో సోమవారం కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఆర్పీడబ్ల్యూడీ చట్టం 2016తో అక్షరాస్యత రాష్ట్రంలో సక్రమంగా అమలుకావడం లేదని, ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్‌సీఐ వంటి సంస్థలకు తనను సలహాదారుడిగా కానీ, సభ్యుడిగా కాని నియమించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌తో ఈ విషయంపై చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్



నల్లగొండ, జూన్ 24 : ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌గా సోమవారం ఎం.రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆర్‌ఎంగా పనిచేసిన ఎస్.శ్రీదేవి బస్సు భవన్ సీటీఎంగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్‌కు పలువురు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నల్లగొండ డిపోలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ రీజియన్ 100శాతం ఓఆర్ కంటే ఎక్కువగా ఉండి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఈ విధంగా మొదటి స్థానంలో కొనసాగించి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తమ పరిధిలో ఉన్నవాటిని పరిష్కరిస్తానన్నారు. డిపోలోని పలు విభాగాలను తనిఖీ చేశారు.

సాగర్ డ్యాం ఎస్పీఎఫ్ ఆర్‌ఐగా అదనపు బాధ్యతలు

నాగార్జునసాగర్, జూన్ 24 : నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎస్పీఎఫ్ ఆర్‌ఐగా ఎస్‌ఐ విజయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. దీంతో ఆయన బాధ్యతలను విజయ్‌కుమార్‌కు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



కట్టంగూరులో విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కట్టంగూరు, జూన్ 24 : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. టీఎస్‌యూటీఎఫ్ కట్టంగూరు మండల శాఖ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం కట్టంగూరులోని జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో విద్య వ్యాపారంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నిలబడాలంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు భాగస్వాముల కావాలని కోరారు. చదువు ద్వారానే ఆర్థిక, సామాజిక అంతరాలు తొలగిపోతాయన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వీరేశం చేపట్టిన ఉద్దీపన కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాలలు అన్నీ బలోపేతం అయ్యాయన్నారు. 150మంది విద్యావలంటీర్లతో ఉద్దీపన కార్యక్రమాన్ని నడిపిస్తున్న ఎమ్మెల్యే వీరేశంను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి మౌలిక వసతుల కల్పన, సర్వీసు పర్సన్ల నియామకం కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి తనవంతుగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడానికి ప్రజలు సహకరించాలన్నారు. మండల వ్యాప్తంగా మొదటి, రెండు, మూడో ర్యాంకు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4వేల నగదును టీఎస్‌యూటీఎఫ్ తరఫున అందజేశారు. దీంతో పాటు మరికొంత మంది విద్యార్థులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జెల్లా ముత్తిలింగం, ఎంపీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, హెచ్‌ఎం అంజయ్య, నాయకులు మిట్టపల్లి మురళయ్య, రాంమోహన్, కృష్ణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంపి.. పనిచేసే చోటే పాతిపెట్టి

ఎలక్ట్రీషియన్‌ను చంపి పూడ్చిపెట్టి కూలీ పరారీ ● నాగార్జునసాగర్‌లో ఘటన

•7లో..

65వ నెంబర్ జాతీయ రహదారిపై చోరీ

● కారు డిక్కీలో నుంచి రూ.2.21 లక్షల నగదు అపహరణ ● చౌటుప్పల్ మండలంలో ఘటన

ఇంటర్ సప్లిమెంటరీలో బాలికలదే పైచేయి

ప్రథమంలో 66.52శాతం, ద్వితీయంలో 57.24 శాతం ఉత్తీర్ణత

•6లో..

పాతబడితో భయం భయం

- పాత భవనంలో కొనసాగుతున్న చింతకుంట్ల పాఠశాల
- కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించని వైనం

•7లో..

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

నల్లగొండ, జూన్ 24 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో నల్లగొండ జిల్లాలో బాలికలు పైచేయి సాధించారు. మే, జూన్ నెలలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదలచేశారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 7,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,962 మంది(66.52శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 3,685మందిలో 2,230 మంది (60.52 శాతం), బాలికల విభాగంలో 3,774మందికి 2,732మంది(72.39శాతం) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ప్రథమసంవత్సరం ఒకేషనల్ విభాగంలో 1,007 మంది విద్యార్థులకు 605మంది(60.08శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 3,994మంది విద్యార్థులకు 2,286మంది(57.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 2,350మందికి 1338మంది(56.94శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో మొత్తం 1644 మందికి 948మంది (57.66 శాతం)ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయసంవత్సరం ఒకేషనల్ విభాగంలో మొత్తం 848కి 481 మంది(56.72శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఇందుకు రాష్ట్ర స్థాయి ర్యాంక్



రేఖా ఇందు | తోట సంజన | జీ సృజన | పీ వెంకటేష్

హుజూర్‌నగర్ : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించారు. ఎంపీసీ విభాగంలో రేఖా ఇందు 470 మార్కులకు 466 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. అదేవిధంగా తోట సంజన 466/470, పిల్లుట్ల వెంకటేష్, ఒకేషనల్ కోర్సులో 458/500, జి.సృజన హెచ్‌ఈసీలో 439/500 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీఐఈవో జే కృష్ణయ్య, ప్రిన్సిపల్ వీడీఎస్ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

పిశాటిగూడెంలో చైన్‌స్నాచింగ్

చిట్యాల రూరల్, జూన్ 24: మిట్టమధ్యాహ్నం వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ జరిగింది. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పరిధిలోని పిశాటిగూడెంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ డీ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం ఏపూర్ గ్రామపరిధిలోని పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ తన కుమారుడు, కోడలు పొలానికి వెళ్లగా ఆమె ఇంటి వద్ద ఆరు బయట కూర్చుంది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి తాగేందుకు మంచినీరు ఇవ్వాలని అడిగారు. అయితే మంచినీళ్లు లేవని చెప్పి, ఆమె తన నివాసంలోకి వెళ్లి మంచంపై నిద్రకు ఉపక్రమించింది. కాసేపట్లోనే ఇద్దరు దొంగలు నివాసంలోకి చొరబడి సుగుణమ్మ తలను ఒకరు పట్టుకోగా మరొకరు మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లారు. సుగుణమ్మ భయంతో అరుస్తూ బయటకు రాగా అప్పటికే దొంగలు పరారయ్యారు. స్థానికులు డయల్- 100కు ఫోన్ చేయగా చిట్యాల పోలీసులు విచారణ చేపట్టారు. దొంగతనం చోరీ చేసిన పుస్తెలతాడు సుమారు మూడు తులాలకుపైగా ఉంటుందని తెలిసింది. సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిడమనూరు, జూన్ 24: నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు గ్రామానికి చెందిన గాజుల చంద్రమౌళి కుమార్తె భగవతి(37)కి హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రాంతానికి చెందిన మర్రి రవి రాజుతో 19ఏళ్ల కిందట వివాహం జరిగింది. గత నెల 19వ తేదీన భార్యాభర్తలు గొడవపడటంతో భగవతి పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈక్రమంలో ఈ నెల 21వ తేదీన బయటకు వెళ్లిన భగవతి మూడు రోజుల వరకు కూడా ఇంటికి రాలేదు. అత్తింటితో పాటు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని భగవతి తండ్రి చంద్రమౌళి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. కాగా భగవతి గతంలో కూడా ఓసారి అదృశ్యమై ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లభించిందని పోలీసులు తెలిపారు.

పాతబడితో భయం భయం

» పాత భవనంలో కొనసాగుతున్న చింతకుంట్ల పాఠశాల » కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించని వైనం



పాతబడిన తరగతి పైకప్పు

చింతకుంట్లలోని హైస్కూల్

కొండమల్లేపల్లి, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో కొన్ని స్కూళ్లను ఎంపిక చేసి మన ఊరు మన బడి పథకం కింద నిధులు మంజూరు చేసింది. కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల ప్రైమరీ హై స్కూల్ భవనం పాత బడడంతో భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించడానికి 2022లో 'మన ఊరు మన బడి' పథకం కింద రూ.38.78లక్షలతో అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో పాత భవనంలోనే అర కొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పుడు పాఠశాల మొత్తం కురుస్తుంది. విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు తడుస్తున్నాయి. పాఠశాల భవనం పాతది కావడంతో గోడలు మొత్తం వర్షానికి తడిసి ఎప్పుడు కూలుతాయోనని భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. వంటగది కూడా చిన్నదిగా కావడంతో చిన్నారులు భోజనం వడ్డించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యార్థుల సౌకర్యార్థం కోసం పాత బిల్డింగ్‌ను కూల్చివేసి కొత్త బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల భవనం పాతబడటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లాం. వర్షం వచ్చినప్పుడు పాఠశాల భవనం మొత్తం వర్షంతో కురుస్తుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన చేపట్టాల్సిన అవసరముంది.

- విజయ శ్రీ, ప్రైమరీ స్కూలు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, చింతకుంట్ల

నిధులు మంజూరు కాక పనులు మొదలు కాలేదు

నిధులు రాకపోవడంతో భవనం నిర్మాణపనులు ప్రారంభించలేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త భవన నిర్మాణం త్వరలో ప్రారంభిస్తాం. అలాగే వంటగది పెద్దగా నిర్మాణం చేయాలంటే అక్కడ హై స్కూలు ప్రైమరీ స్కూలు ఒకే చోటు ఉండటంతో స్థలం ఎక్కువగా లేకపోడంతో నిర్మాణం చేపట్టలేదు.

- ధర్మేంద్ర, పంచాయతీరాజ్ అధికారి.

బడి మార్చారు.. భవనం మరిచారు

» జూనియర్ కళాశాల రేకుల గదుల్లో తరగతుల నిర్వహణ » పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది



జూనియర్ కళాశాలలోని పాత ఫర్నీచర్ గదిలో చదువుకుంటున్న విద్యార్థులు, పాఠశాల ముందు నిలిచి ఉన్న వర్షపు నీరు

భానుపురి, జూన్ 24: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని పాఠశాల భవనం పాతది కావడంతో దానిని కూల్చేశారు. సంవత్సరం క్రితం నిధులు మంజూరైనా పనులు పూర్తి కావడం లేదు. పాత భవనాన్ని కూల్చివేసి రెండున్నర సంవత్సరాలు అవుతు న్నా ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. జూనియర్ కళాశాలకు సంబంధించిన రేకుల గదుల్లోకి పాఠశాలను మార్చారు. 90 మంది విద్యార్థులు విద్యనభిస్తున్నారు. రేకుల గదు ల్లో కరెంటు లేకపోతే ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేదు. ఉక్కపోత విపరీతంగా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఈ గదుల్లో పాత ఫర్నిచర్ వేయడంతో ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. వర్షం వస్తే జూనియర్ కళాశాల ప్రాంగణంలోని నీరంతా ఈ రేకుల గదుల ముం దు నిల్వ ఉంటుంది. వారం రోజుల వరకు బురదమయంగా ఉంటోంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే క్రీడల కోసం మట్టిపోసి చదును చేయడం వల్ల పాఠశాల ప్రాంగణం వైపు ఒంపు ఉండి నీరు నిల్వ ఉంటోంది. కొత్త పాఠశాల భవనం నిర్మాణానికి సంవత్సరం క్రితం నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టలేదు. ఎమ్మెల్సీ కోటా నిధులు రూ.55 లక్షలు మంజూరైనా పాఠశాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కి. ఆంధ్రయ్య తెలిపారు. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



మహేష్(ఫైల్)

భువనగిరి రూరల్, జూన్ 24: కుటుంబకలహాలు, అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లెర్ల మహేష్(23) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అదేవిధంగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కల్లులో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన కుటుంబసభ్యులు 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహేష్ తండ్రి ఎల్లయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కోడె మృతి



కోడె కళేబరం వద్ద విలపిస్తున్న రైతు

మోత్కూరు, జూన్ 24: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో బద్దం యాదిరెడ్డికి చెందిన కోడె విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు యాదిరెడ్డి ఆదివారం సాయంత్రం కోడెను మేత మేయడానికి పొడవైన తాడుతో మరో రైతు వ్యవసాయ క్షేత్రంలో కట్టి వేశాడు. ఆ కోడె మేత మేస్తూ వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆదివారం రాత్రి రైతు కోడెను దొడ్లోకి తోలుకొద్దామని వెళ్లే సరికి కోడె విద్యాదాఘాతంతో మృతిచెందింది. కోడె మృతితో రూ.40వేల నష్టం వాటిల్లిందని రైతు విలపించాడు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు తక్కువగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అడ్డగూడూరు; విద్యుదాఘాతంతో కాడి ఎద్దు మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ధర్మారంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కప్పల వెంకన్నకు చెందిన కాడి ఎద్దు గ్రామంలోని కాటమ్మయ్య గుడి సమిపంలో మేపుతుండగా సమీపం లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటంతో ఫేజ్ వైర్ తగిలి అక్కడిక క్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని రైతు తెలిపారు.

25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

దేవరకొండ, జూన్ 24: జడ్చర్ల-నాగార్జునసాగర్ రహదారి, దేవరకొండ పట్టణంలోని మీనాక్షి సెంటర్‌లలో సోమవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నెంబరుప్లేట్లు, ధ్రువీకరణ పత్రాలులేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. వాహనాల పత్రాలు తీసుకొస్తే వాహనాలను అప్పగిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో దేవరకొండ ఎస్ఐలు వెంకటయ్య, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

తిప్పర్తి, జూన్ 24: గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని పెద్దసూరారం గ్రామ శివారులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీ రాత్రి జాతీయ రహదారి వెంట ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో గుర్తుతెలియని వ్యక్తులు 360 లీటర్ల ఆయిల్‌ను చోరీ చేశారు. విద్యుత్ ఏఈ రమ్య సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయిల్ విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది.. రైలు కిందపడి

బీబీనగర్, జూన్ 24: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో సోమవారం జరిగింది. పట్టణ పరిధిలోని రంగా పురం గ్రామానికి చెందిన తుమ్మల నరేందర్‌రెడ్డి అలియాస్ రాజిరెడ్డి (55)తన భూమి విషయంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థతో కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. దీంతో కొంతకాలంగా మానసిక క్షోభకు గురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటికి సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మార్నింగ్ వాక్‌కు వెళ్లి ఇంటికి చేరుకున్న నరేందర్‌రెడ్డి టీ తాగి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రైల్వేస్టేషన్ సమీపంలో కూతవేటు దూరంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై వెళ్లి 225/28-30 మైలు రాయి వద్ద దిగువ లైన్ పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యులఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

ఆలేరు రూరల్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఏ. సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 6.45 సమయంలో ఆలేరు రైల్వే స్టేషన్ ఓం సిగ్నల్ కిలో మీటర్ నెంబర్ 263/19 పెంబర్తి ఆలేరు మధ్య గుర్తుతెలియని మృతదేహం పడిఉంది. మృతదేహంపై బ్లూ బ్లాక్ చెక్స్ షర్ట్ బ్లాక్ రంగు షార్ట్ ఉందని, మెడలో నల్లదారం ఉంది. మృతదేహాన్ని భువనగిరిలోని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ కోసం సెల్: 8712568454, 9100742260 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాలో నిరసనల హోరు

● నల్లగొండ ఆస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్ల నిరసన, ధర్నా ● సూర్యాపేట, భువనగిరి యాదాద్రి జిల్లాల్లో ప్రజా సంఘాల ఆందోళనలు

నల్లగొండ టౌన్, జూన్ 24: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మెబాట పట్టారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం అత్యవసర సేవలను మినహాయించి వార్డు, ఓపీ, ఇతర సేవలను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కె.అబ్దుల్ సమద్, ప్రధాన కార్యదర్శి గగన్, పెరుమాళ్ల మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్‌ను నెలనెలా చెల్లించాలని, మెడికల్ కళాశాలలో అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వాలు కొన్నేళ్లుగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వెంటనే స్కాలర్‌షిప్‌లకు అవసరమైన ప్రత్యేకమైన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి క్యాజువాలిటీలో ప్రత్యేకంగా ఏసీలు లేకపోవడం, అత్యవసర మందులు లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందించలేకపోతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వ స్పందించి అత్యవసర మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్యులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పీజీ డాక్టర్లకు సరైన వసతులు కల్పించకపోవడంతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు వేతనాలు పెంచాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానందకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు రుత్విక, సత్యసాయికృష్ణ, రేవంత్, జాన్సీ, బాలు వేమిరెడ్డి, శ్రీనిధి, హరీష, రషీద, దీపిక, శ్రీవల్లి, కేవీ భరత్, మమత, ఇంద్రాణి, దినేష్, శివ కుమార్, సంతోష్ బాబు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

అంగన్‌వాడీల వేతనాలు రూ.18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తక్షణమే వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా తీవ్రఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2023 సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు 4 వరకు 24 రోజుల సమ్మె చేస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా తక్షణమే రూ.18 వేల చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి ఎడమ సుమతమ్మ, శాంతకుమారి, కోట్ల శోభ, శాంతాబాయి, సాయి సుజిత, బీ రాణి, అన్నపూర్ణ, ప్రభావతి, అంజలి, రమణ, వణజా, పాల్గొన్నారు.



నల్లగొండలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ: మెగా డీఎస్సీ విడుదల చేయలని డిమాండ్ చేస్తూ టీఎస్‌పీఎస్ వద్ద టీఎస్‌పీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన నిరుద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సుభాస్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగాలలో మెయిన్స్‌కు 1:100 చొప్పున క్వాలీపై చేయాలని, గ్రూప్-2,3 ఉద్యోగాల్లో అదనపు పోస్టులను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచెర్ల అభిలాష్, నాయకులు సంఘపాక రాంబాబు, భరత్, ముంత సైదులు, కానుగు గోపి, లోహిత్‌రెడ్డి, దుబ్బాక సాయి, గోపిరెడ్డి, వంశీ, నాగరాజు, అనీల్ ఉన్నారు. అదేవిధంగా డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేయాలని నిరుద్యోగులు పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ జిల్లా నాయకులు మేడి కిరణ్, సైమన్, ఎండి.అమీర్, ఎం. రాము తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి

భువనగిరి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గౌరవ వేతనం రూ. 10వేలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డీ. ఇమ్రాన్ డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. కార్మికులను విధుల నుంచి తొలగించకుండా కొనసాగిస్తూ ప్రైవేట్ వ్యక్తులకు ఈ పథకాన్ని అప్పగించొద్దన్నారు. కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, వయస్సు పైబడిన వారికి రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు, స్లాబ్ ధరలు పెంచడంతో పాటు నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం కింద కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే. జెండగే, డీఈవో కే. నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్‌బేగం, నాయకులు సంధ్య, నిర్మల, పద్మ, లక్ష్మీ, అనసూయ, వాణి, ఆండాలు, క్రిష్ణవేణి, సుగుణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సూర్యాపేట కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

సూర్యాపేట(కలెక్టరేట్): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షురాలు చెరుకు యాకలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాకలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, వంటలు చేయడానికి అవసరమైన గ్యాస్ సిలిండర్లను సబ్సిడీపై అందించాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గీత, కుమారి, తిరుపతమ్మ, వెంకటమ్మ ఉన్నారు.

65వ నెంబర్ జాతీయ రహదారిపై చోరీ

● కారు డిక్కీలో నుంచి రూ.2.21 లక్షల నగదు అపహరణ ● యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఘటన

చౌటుప్పల్ రూరల్, జూన్ 24: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కారులోని రూ.2.21 లక్షల నగదును చోరీ చేశారు. సోమవారం చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పండ్రేగుపల్లికి చెందిన కాత్రాల ఉపేందర్ ఈ నెల 22న తన నాయనమ్మ తిరుపతమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆమెను తీసుకుని స్నేహితుడు వీరబాబుతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లాడు. అదే రోజు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. తిరిగి 23వ తేదీ సాయంత్రం గ్రామానికి బయలుదేరారు. ఇదిలా ఉండగా పండ్రేగుపల్లికి చెందిన ఉపేందర్ బంధువులు పాశం పావని, కాత్రాల శ్రీను హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఉపేందర్ గ్రామానికి వెళ్తున్నాడని తెలుసుకుని స్వగ్రామంలోని కుటుంబ సభ్యులకు డబ్బులు ఇవ్వాలని పావని రూ.1.48లక్షలు, కాత్రాల శ్రీను రూ.73వేలు ఇచ్చారు. ఆ డబ్బులు తీసుకున్న ఉపేందర్, స్నేహితుడు వీరబాబుతో కలిసి బయలుదేరారు. మార్గమధ్యలో దిల్‌సుఖ్‌నగర్ వద్ద మరో స్నేహితుడు గోవిందరావుతో కలిసి మద్యం తాగారు. అక్కడినుంచి రాత్రి 8.30 గంటలకు ఖమ్మం బయలుదేరారు. దండుమల్కాపురం జాతీయ రహదారి పక్కన స్వాతి దాబాలో రాత్రి 10గంటలకు టిఫిన్ చేసి కారులోనే నిద్రించారు. డబ్బులు డిక్కీలో పెట్టి గాలి కోసం డోర్లు తెరిచి ఉంచారు. అర్ధరాత్రి రెండు గంటలకు నిద్రలేచిన ఉపేందర్ కారులో ఉన్న నగదు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే డయల్-100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హోటల్‌కు సంబంధించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో యాక్టివా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

చంపి.. పనిచేసే చోటే పాతిపెట్టి..

● ఎలక్ట్రీషియన్, కూలీ మధ్య ఘర్షణ ● ఎలక్ట్రీషియన్‌ను చంపి పూడ్చిపెట్టి పరారీ ● నాగార్జునసాగర్‌లో ఘటన



మట్టిలో పూడ్చిన రహమాన్ మృతదేహాన్ని బయటికి తీయిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్, జూన్ 24: ఒకరు ఎలక్ట్రీషియన్.. మరొకరు కూలీ.. పనిచేసే చోట ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. కోపోద్రిత్తుడైన కూలీ ఎలక్ట్రీషియన్‌ను చంపి పనిచేసే చోటే పూడ్చిపెట్టి పరారయ్యాడు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. సీఐ బీసన్న తెలిపిన సమాచారం మేరకు వివరా లిలా ఉన్నాయి. నాగార్జునసాగర్‌కు చెందిన పర్వతనేని నాగేశ్వరరావు అలియాస్ పెదబాబుకు స్థానికంగా షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. మొదటి అంతస్తును ఓ ప్రైవేట్ పాఠశాలకు లీజుకు ఇచ్చేందుకు నెల రోజులుగా నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. హిల్‌కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ రహమాన్(38)కు సంబంధిత పనులు అప్పగించగా, 10 రోజులుగా అక్కడ పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన శివారెడ్డి రెండు రోజులుగా పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి శివారెడ్డి, రహమాన్ మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. శివారెడ్డి రెహమాన్‌ను బలమైన వస్తువుతో కొట్టి హత్యచేసి పనులు జరుగుతున్న పాఠశాల ఆవరణలోనే మృతదేహాన్ని సిమెంటు బస్తాలో చుట్టి మట్టిలో పాతి పెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆదివారం ఉదయం నుంచి రహమాన్, శివారెడ్డి కన్పించకపోవడంతో పెదబాబు వారి గురించి ఆరా తీశాడు. ఆదివారం ఉదయం పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ రక్తపు మరకలు ఉండడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు వచ్చి పాఠశాల పరిసరాలను, అక్కడ ఉన్న రక్తపు మరకలను పరిశీలించి ఊరి చివరివరకు వెళ్లాయి. సోమవారం ఉదయం ఓ చోట మట్టి వీధి కుక్కలు తవ్వి పీక్కుతింటుండడంతో పోలీసులు అటుగా వెళ్లి చూడగా, మృతదేహం మోకాలు బయటకు కనిపించింది. దీంతో పోలీసులు వెంటనే సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌లకు సమాచారం ఇచ్చి మునిసిపల్ సిబ్బంది సహకారంతో రహమాన్ మృతదేహాన్ని బయటికి తీయించారు. శివారెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

తమకు న్యాయం చేసిన తర్వాతే రహమాన్ మృతదేహాన్ని బయటకు తీయాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు నిర్మాణంలో ఉన్న పాఠశాల గేటు ఎదుట బైఠాయించారు. దీంతో పోలీసులు కుటుంబ సభ్యులను పిలిచి, షాపింగ్ కాంప్లెక్స్ యజమానితో మాట్లాడించారు. నష్టపరిహారం కింద కోటి రూపాయలు ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేయగా, రూ.10లక్షలు చెల్లిస్తానని యజమాని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రహమాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎంకేఆర్ మోడ్రన్ రైస్‌మిల్లర్‌పై కేసు

గరిడేపల్లి, జూన్ 24: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఎంకేఆర్ మోడ్రన్ రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాసంగి, వానాకాలం వడ్లకు సంబంధించి 15,795 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం కేటాయించగా మిల్లు యజమాని కరుణాకర్ ప్రభుత్వానికి తిరిగి ఇవ్వకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లును తనిఖీ చేయగా మిల్లులో ధాన్యం నిల్వ లేనట్లు గుర్తించారని తెలిపారు. కాగా ప్రభుత్వానికి సంబంధించి రూ.31.99 కోట్ల విలువగల సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా దుర్వినియోగం చేశారని ఎస్ఐ తెలిపారు. దీంతో కరుణాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రాములు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కొండమల్లేపల్లి, జూన్ 24: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని అంగోతుతండా, మేగ్యతండా, జోగ్యతండా, జేత్యతండాల్లో దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మేఘ్యతండాలో 200 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేయగా 150 కిలోల పటిక, 15 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, కానిస్టేబుళ్లు స్వామి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనయ్య, అనిల్ పాల్గొన్నారు.

బండరాయి మీదపడి కార్మికుడి మృతి

కనగల్, జూన్ 24: ప్రమాదవశాత్తు బండరాయి జారి మీదపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని చర్లగౌరారంలో సోమవారం జరిగింది. ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాలిలా ప్రకారం.. మండలంలోని ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన రాయికొట్టు కార్మికుడు షేక్‌నజీర్(31) రోజువారీగా సోమవారం గ్రామ సమీపంలోని చర్లగౌరారం గ్రామ గుట్టకు రాయికొట్టే పనినిమిత్తం తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు బండరాయి నజీర్‌పై పడింది. తల వెనుక భాగంలో తీవ్రమైన గాయమైంది. 108 అంబులెన్స్‌లో చికిత్సనిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి అతడిని తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. నజీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెచ్చులూడిన పైకప్పు.. తప్పిన ప్రమాదం



డీఈఈ టేబుల్, కుర్చీ పక్కన పడిన పైకప్పు శకలాలు

మునుగోడు, జూన్ 24 : నల్లగొండ జిల్లా మునుగోడులోని గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) సబ్ డివిజనల్ కార్యాలయం భవన పైకప్పు సోమవారం సాయంత్రం సమయంలో పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదంతప్పింది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. అదే భవనంలో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. డీఈఈ ఛాంబరు కుర్చీ, టేబుల్ పైనే పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. ఒక్కసారిగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో అప్పుడే విధులు ముగించుకొని బయటకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా పైకప్పు పెచ్చులూడి పడిఉన్నాయి. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏఈ మణికుమార్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

● మండలాల్లో ప్రారంభమైన 'ప్రజావాణి'

● అర్జీలను స్వీకరించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజల వద్దకు పాలనను చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన బృహత్తర కార్యక్రమమే ప్రజావాణి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని అన్ని మండలకేంద్రాల్లో గల ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తుండగా ప్రజలు సుదూర ప్రాంతానికి వెళ్లి సమస్యలను తెలియచేస్తుండటంతో పాటు వారు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మండల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో మండలకేంద్రాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులందరూ విధిగా కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను సహృదయంతో విని వాటిని పరిష్కరించాలని సూచించారు.

● ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని జాయింట్ కలెక్టర్లు శ్రీనివాస్, పూర్ణచందర్ అన్నారు. అడవిదేవులపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, మిర్యాలగూడ, కట్టంగూరు, చిట్యాల మండలాల్లో నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో పాల్గొనే అధికారులకు ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఫిర్యాదులను యాంత్రికంగా స్వీకరించకుండా సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. దరఖాస్తులకు రశీదులు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని ఫిర్యాదులను డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం దొరకని కేసుల్లో కోర్టులను ఆశ్రయించాలని అర్జీదారులకు సూచించాలని అన్నారు. 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని అన్నారు.

● అడవిదేవులపల్లిలో మొత్తం 232 దరఖాస్తులు రాగా అందులో 169 రెవెన్యూకు సంబంధించినవి కాగా మిగతా 69 ఆయాశాఖలకు చెందినవని తెలి పారు. ఆ దరఖాస్తులను పరిశీలించి వారంలో పరిష్కరిస్తామని జేసీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జేసీ శ్రీనివాస్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిర్యాలగూడ మండలం తడకమళ్లలో 142 ఎకరాల ఊర చెరువు, వేములపల్లి మండలం కామేపల్లి గ్రామంలోని కోనేరు చెరువు 186 ఎకరాలు రైతులు ఆక్రమించారని అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



త్రిపురారంలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు



చిట్యాలలో నిర్వహించిన ప్రజావాణిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచందర్

కలెక్టర్ స్పందిస్తూ వారం రోజుల్లో అధికారులు సర్వేకు వస్తారని వారికి గ్రామస్థులు సహకరించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవోలు శేషగిరిశర్మ, తహసీల్దార్ హరిబాబు, ఎంపీపీ నూకల సరళ, పీఆర్ ఏఈ ఆదినారాయణ పాల్గొన్నారు.

● దామరచర్లలో ప్రజావాణి ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్యామ్‌సుందర్, ఎంపీడీవో మూర్తి, తహసీల్దార్ జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచందర్ అర్జీలను స్వీకరించారు. మండలంలోని బొల్లేపల్లికి చెందిన రైతులు కరెంటు స్తంభాలు ఇవ్వకుండా ఏఈ కాలయాపన చేస్తున్నారని, రైతుల కోసం తెచ్చిన స్తంభాలను అమ్ముకుంటున్నారని ట్రాన్స్‌కో ఏఈపై ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్ ట్రాన్స్‌కో ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి విజయేందర్‌రెడ్డి ప్రజావాణి నుంచే ట్రాన్స్‌కో ఏస్ఈతో ఫోన్‌లో మాట్లాడి బొల్లేపల్లి చెందిన రైతులకు స్తంభాలను మంజూరు చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవి, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీపీ ముత్తిలింగం, తహసీల్దార్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● చిట్యాలలో అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్ అర్జీలను స్వీకరించారు. అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిట్యాలలో 61 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రవణ్‌కుమార్, ఎంపీడీవో జయలక్ష్మి, తహసీల్దార్ కృష్ణ, మునిసిపల్ కమిషనర్ వీరేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నిడమనూరులో డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి ప్రజావాణిని ప్రారంభించి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 54 దరఖాస్తులు వచ్చాయి. నిడమనూరులోని నల్లచౌట చెరువు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ఆదర్శ రైతు వెంకట్‌రాహుల్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుర్రం వెంకటేశం, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో ముని కృష్ణయ్య, ఏఈలు వెంకటేశం, గ్రీష్మ, ఆర్ఐ సునీత పాల్గొన్నారు.

● వేములపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, మండల ప్రత్యేకాధికారి మక్బూల్ అహ్మద్, ఎంపీడీవో శారదాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో ప్రజల నుంచి మొత్తం 36 అర్జీలు వచ్చినట్లు మండల ప్రత్యేకాధికారి రమేష్, ఎంపీడీవో ఉమేష్‌చారి తెలిపారు. వీటిలో అత్యధికంగా 23 అర్జీలు రెవెన్యూ సంబంధమైనవే ఉన్నాయి. పంచాయతీరాజ్‌కు 8, విద్యుత్‌కు 2, ఆర్‌అండ్‌బీకి 1 అర్జీ వచ్చింది. అర్జీలన్నింటినీ ఆన్‌లైన్ చేశామని, 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో సుధాకర్ పాల్గొన్నారు.

● దామరచర్లలో ఏడు నెలలుగా జీతాలు రాక గ్రామపంచాయతీ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామపంచాయతీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ భైరం దయానంద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సాగు చేసుకుంటున్న పార్ట్-బీ భూములకు పట్టాలు అందించాలని, ధరణి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు జేసీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

● డిండిలో రైతుల ఆధీనంలో ఉన్న నీటిపారుదలశాఖ భూములకు హక్కులు కల్పించాలని రైతులు ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రం అందజేశారు.

● దేవరకొండలో ప్రజావాణిని ఆర్డీవో శ్రీరాములు ఆయన ప్రారంభించగా 71 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. 18కి పైగా రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఇందిర, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, ఎంఈవో మాతృనాయక్, అధికారులు పాల్గొన్నారు.

● దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని సమస్యలను ప్రజావాణిలో పరిష్కరించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మునిసిపాలిటీలో వచ్చిన దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈ రాజు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

● కేతేపల్లిలో నల్లగొండ ఆర్డీవో రవి ప్రజావాణిని ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 31మంది దరఖాస్తులు అందించారు. వీటిల్లో రెవెన్యూకు చెందిన 27 దరఖాస్తులు, ఎంపీడీవో కార్యాలయానికి చెందినవి 2, ట్రాన్స్‌కో, చిన్న నీటిపారుదల శాఖకు చెందిన ఒక్కో దరఖాస్తు ఉందని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోటేశ్వరరావు, ఎంపీపీ పి.శేఖర్, మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఏవో బి.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

● తిప్పర్తిలో మొత్తం 27 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి భూమన్న అన్నారు. వాటిల్లో రెవెన్యూ 22, తాగునీటి సమస్యపై 1, మండల పరిషత్‌లో 3, ఇరిగేషన్‌పై ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ డి. స్వప్న, డీఈ నాగయ్య, ఏవో సన్నిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాభవాని పాల్గొన్నారు.

● చండూరులో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ప్రత్యేక అధికారి సురేష్, నోడల్ ఆఫీసర్ ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ దశరథ, మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్ అర్జీలను స్వీకరించారు. మండలంలో మొత్తం 41 అర్జీలు రాగా, అందులో 21 రెవెన్యూ, మిగతా 20వివిధ శాఖలకు సంబంధించినవి తెలిపారు. పట్టణానికి చెందిన ఏలె వజ్రమ్మ అనే వృద్ధురాలికి భర్త మరణించగా పిల్లలు ఎవరూ లేరు. రేషన్ నుంచి వచ్చే 6కిలోల బియ్యంతోనే జీవనం సాగిస్తుంది. తమకు వృద్ధాప్య, వితంతువు పింఛన్ ఇవ్వాలని సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు ఇవ్వడానికి వచ్చింది. ఎంపీడీవో కార్యాలయం పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉండటంతో నడుచుకుంటూ వచ్చిన ఆమె కార్యాలయం లోపలికి వెళ్లలేక మెట్లపైనే కూర్చుండి పోయింది. గమనించిన అధికారులు దరఖాస్తును పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



వేములపల్లి: ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అడవిదేవులపల్లిలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

● పెద్దఅడిశర్లపల్లి ఉమ్మడి మండలంలో 67 అర్జీలు వచ్చినట్లు ప్రత్యేకాధికారులు బి.వెంకటేశ్వర్లు, కె.ఎస్. మల్లేశ్వర్‌రావు తెలిపారు. రెవెన్యూ సంబంధించి 40, ఎంపీడీవోకు 23, మిగిలినవి ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, నర్సింహారావు, ఎస్ఐ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడులో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి ప్రజావాణిని ప్రారంభించి అర్జీలను స్వీకరించారు. 22 అర్జీలు రాగా వాటిలో 10 రెవెన్యూ, 3 ట్రాన్స్‌కో, 4 గ్రామపంచాయతీ, 5 పింఛన్లకు సంబంధిచినవి ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూజ, తహసీల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్)లో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, ఎంపీపీ భగవాన్‌నాయక్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, డీటీ నాగమణి మండల అధికారులు పాల్గొన్నారు.

● త్రిపురారంలో మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ 35 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. ఇందులో రెవెన్యూ 16, పంచాయతీరాజ్‌శాఖకు సంబంధించి 19 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమారి, ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఇన్‌చార్జి ఎంపీవో రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో మండల ప్రత్యేకాధికారి, డీఈవో భిక్షపతి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కుక్కడంలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, ఎంపీడీవో స్వామి, తహసీల్దార్ పద్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు ప్రజావాణిని ప్రారంభించారు. కార్యక్రమంలో మొత్తం 51 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి ద్వారక్ తెలిపారు. రెవెన్యూ 23, ఎంపీడీవో కార్యాలయానికి సంబంధించి 26, ఐసీడీఎస్, ఆర్‌అండ్‌బీ విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీవో నర్సింహారావు, వైద్యాధికారి ఉషారాణి పాల్గొన్నారు.

● కనగల్‌లో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో 25 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఎంపీడీవో జయరాం, ఎంపీవో సుమలత, అధికారులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో నిర్వహించిన ప్రజావాణికి 44 దరఖాస్తులు వచ్చి నట్లు మండల ప్రత్యేక అధికారి ఆఫీసర్ రామారావునాయక్ తెలిపారు. అందులో 3 దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. రెవెన్యూ 22, అన్ని శాఖలకు సంబంధించి 20, ఆర్టీసీ 1, పోలీస్ శాఖకు సంబంధించి 1అర్జీ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్ హుస్సేన్, ఎంపీడీవో రేఖల లక్ష్మయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నల్లగొండలో ప్రత్యేక అధికారి నవీన్, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ ప్రజావాణిని ప్రారంభించారు. 30 అర్జీలు రాగా వాటిల్లో రెవెన్యూ శాఖకు 21, ట్రాన్స్‌కో 2, మైనింగ్ 1, గ్రామ పంచాయతీ 5, ఐకేపీ 1 అర్జీలు వచ్చినట్లు వారు తెలిపారు.

● మర్రిగూడలో 4 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలుసుకున్న అధికారులు హుటాహుటీన కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ రావడం లేదని తెలుసుకున్న అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ యాకుబ్ ఆలీ, ఎంపీవో రవికుమార్ పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

వేములపల్లి, జూన్ 24: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.10లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం-2 భవనాన్ని సోమవారం ఆయన ఎంపీపీ పుట్టల సునీతతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వారిలో రక్తహీనత నివారణకు అవసరమైన పోషకాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీటీసీలు చైతన్య, పల్లా వీరయ్య, మాతంగి చంటి, పీఏసీఎస్ చైర్మన్ జడ రాములు, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, నాయకులు రావు ఎల్లారెడ్డి, పుట్టల శ్రీను, శ్రీనివాస్, వెంకటయ్య, గిరి, హాజీ పాల్గొన్నారు.

'పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలి'

దేవరకొండ, జూన్ 24: దేవరకొండ డివిజన్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్, సీపీఎం మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, పాఠ్యపుస్తకాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వారు ఆరోపించారు. విచారణ చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎడిట్ సౌకర్యాన్ని కల్పించాలి

మిర్యాలగూడటౌన్: ప్రజావాణి దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న తరుణంలో ఎడిట్ ఆప్షన్ కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దరఖాస్తు స్వీకరణ శిబిరానికి దరఖాస్తుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే సాంకేతిక కారణాల కారణంగా పలు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారని అన్నారు. ఆన్‌లైన్ ఎడిట్ ఆప్షన్ ఇస్తే సులభతరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ యూసుఫ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాలొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

మునుగోడు, జూన్ 24: మునుగోడు మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి కోసం జడ్పీ స్థాయి 15వ ఆర్థిక సంఘం నుంచి తన కోటా కింద రూ. 17 లక్షల అభివృద్ధి నిధులు మంజూరైనట్లు జడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి రవి ముదిరాజ్ తెలిపారు. ఇప్పర్తి గ్రామపంచాయతీ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ. 4లక్షలు, మునుగోడులో పైపులైన నిర్మాణానికి రూ. 3లక్షలు, పులిపలుపుల గ్రామంలో పైపులైన్ నిర్మాణానికి రూ. 2లక్షలు, అండర్ గ్రౌండ్ నిర్మాణాల కోసం చల్మెడలో రూ.4.50లక్షలు, మునుగోడులో రూ.1.50లక్షలు, మండల కేంద్రంలో ముదిరాజ్ కమ్యూనిటీ నిర్మాణం కోసం రూ.2లక్షలు చొప్పున నిధులను కేటాయించినట్లు ఆమె వివరించారు.

వర్షాలు కురవాలని కోరుతూ ప్రార్ధనలు



ప్రార్ధనలు చేస్తున్న క్రైస్తవులు

మిర్యాలగూడ టౌన్, జూన్ 24: వర్షాలు కురవాలని కోరుతూ క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో విశ్వాస పరిచర్య చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు హన్యానాయక్ మాట్లాడుతూ వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటాయని, సాగు, తాగునీటికి అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. కాలం కలిసిరాక అన్నదాతలు అగచాట్లు పడుతున్న తరుణంలో వర్షాలు కురవాలని కోరుతూ ఉపవాస దీక్షలతో ప్రార్ధన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమాబాయి, సుధారాణి, జనార్ధన్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రహ్లాద వరదలక్ష్మీనర్సింహస్వామి వేడుకలు



కల్యాణతంతును నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండటౌన్, జూన్ 24: మండల పరిధిలోని దండెంపల్లి రోడ్డులో గల శ్రీ శంకర గోశాల ఆవరణలో గల శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీనర్సింహస్వామి మందిర వార్షిక వేడుకలను సోమవారం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండప పూజలు, ప్రహ్లాద వరద లక్ష్మీనర్సింహస్వామికి మహా కుంభాభిషేకం, అలంకరణ, బలి నివేదన, మహాపూర్ణ ఆహుతి పూజలు చేశారు. అనంతరం అంగరంగ వైభవంగా శాంతికల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాపోలు శ్రీనివాస్, రామాంజనేయులు, గణేష్, భాస్కర్‌రెడ్డి, బాలకిషన్, విజయమోహన్, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొరివేనిగూడెం ప్రాథమిక

పాఠశాల పునఃప్రారంభం

హాలియా, జూన్, 24: అనుముల మండలంలోని చల్మారెడ్డిగూడెం కాంప్లెక్స్ పరిధిలో ఉన్న కొరివేనిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఐదేళ్లుగా విద్యార్థులు లేక మూతపడింది. ఆ పాఠశాలను గ్రామ పెద్దలు, యువకులు, తల్లి తండ్రులు సహాయంతో ప్రధానోపాధ్యాయుడు తీగల మల్లిఖార్జున్ ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను ఏకతాటిపై తీసుకువచ్చి ఒప్పించారు. దీంతో సోమవారం పాఠశాలను గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో చల్మారెడ్డిగూడెం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ముడుసు ప్రకాష్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామం నుంచి బాల బాలికలను దూర ప్రాంతాలకు పంపించకుండా గ్రామంలోని పాఠశాలలకు పంపిస్తామని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ పగిడిమర్రి శ్రీనివాస్, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు రవి, సైదులు, కాశీరాం, లక్ష్మణ్, శంకర్, స్వామి, కాశమ్మ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి

నల్లగొండటౌన్, జూన్ 24: తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు శారీరక, మానసిక అభివృద్ధి పెంపొందుతుందని వన్‌టౌన్ ఎస్ఐ శంకర్ అన్నారు. పట్టణంలోని రాష్ట్ర తై క్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్‌లైట్ తైక్వాండో అకాడమీ లో తైక్వాండో మాస్టర్ జిల్లా సెక్రటరీ అనిల్‌కుమార్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టును నిర్వహించారు. ఈ టెస్టులో విద్యార్థులు వివిధ రకాల కలర్ బెల్ట్‌లను సాధించారు. వారందరికీ ఎస్ఐ బెల్టులను ప్రదానం చేసి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని అన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ శంకర్

దినేష్‌రెడ్డి పేరిట సేవా కార్యక్రమాలు : రేగట్టె



విద్యార్థులకు బ్యాగులు, క్రీడా దుస్తులు అందజేస్తున్న మల్లిఖార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 24: గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన కుమారుడు రేగట్టె దినేష్‌రెడ్డి పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి అన్నారు. తన కుమారుడు దినేష్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని చెర్వుగట్టు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సుమారు రూ. 60వేల విలువైన క్రీడా దుస్తులు, షూస్, బ్యాగులు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడుతూ తన కుమారుడి జ్ఞాపకార్థం పాఠశాలకు ఏ అవసరమైనా తన శక్తిమేర సాయం చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మల్ల బాలకృష్ణ, రమణ, కొత్త నర్సింహ, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య, రేగట్టె మహేందర్‌రెడ్డి, చెర్వుగట్టు ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ప్రజ్ఞాపురం రామకృష్ణ, హెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సుమ, పద్మ, రేగట్టె సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

కొండమల్లేపల్లి, జూన్ 24: మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రతి ఒక్కరూ ఆర్థిక లావాదేవీలను బ్యాంకుల ద్వారా చేయాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ విష్ణుప్రియ అన్నారు. మండల కేంద్రానికి చెందిన విడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ మాట్లాడుతూ ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కో మండ్ల సత్తయ్య, జవహర్‌లాల్, విడ్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త అంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'ను వెంటనే రద్దు చేయాలి

చింతపల్లి, జూన్ 24: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి పారదర్శకంగా వెంటనే నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సేనావత్ కుమార్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఎన్ఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ ఫలితాలతో అవకతవకల కారణంగా ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్‌పామర్, పవన్, గోవింద్, రవి, కొండల్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి, కొత్తనందికొండ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీను తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ల పరిధిలోని అడవిదేవులపల్లి, ముదిమాణిక్యం, ఉల్సాయిపాలెం, గోన్యాతండా, చాంప్లతండా, వస్రంతండా, జీలకరకుంటతండా, హాముతండా, వీర్లపాలెం, కొత్తనందికొండ, బాలెంపల్లి, మొల్కచర్ల, చిట్యాల, బంగారికుంటతండా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కనగల్: మండలంలోని పొనుగోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లోఓ మరమ్మతు పనులు జరుగుతున్న నేపథ్యంలో సబ్‌స్టేషన్ పరిధిలోని పొనుగోడు, రాంచంద్రాపురం, కురంపల్లి గ్రామాలకు త్రీఫేజ్ కరెంటును ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ రాజశేఖరచారి తెలిపారు.

నార్కట్‌పల్లి: అత్యంత ప్రాధాన్యమైన విద్యాశాఖకు నేటికీ మంత్రిని నియమించకపోవడం విచారకరమని బీఎస్పీ మండల అధ్యక్షుడు చెర్కుపల్లి శాంతికుమార్ అన్నారు. సమాజానికి ఉపయోగపడే విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు.

మిర్యాలగూడ టౌన్: విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు అన్నబీమోజు నాగార్జునాచారి, గడగోజు చంద్రశేఖర్ తెలిపారు. విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివాహ పరిచయ వేదికను సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హాలియా: నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించిన వ్యాపారస్థులకు జరిమానాతో పాటు చర్యలు తీసుకుంటామని హాలియా మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ హెచ్చరించారు. హాలియాలో రోడ్డును ఆక్రమించిన వ్యాపారస్థులకు రూ.2 వేల జరిమానా విధించారు. ఆయన వెంట ఎస్ఐ సతీష్‌రెడ్డి, మునిసిపల్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండలం కట్టకొమ్ముతండా ప్రాథమిక పాఠశాలలో చొల్లేటి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు చొల్లేటి ట్రస్టు నిర్వాహకులు చొల్లేటి భాస్కరచారి తెలిపారు. సోమవారం కట్టకొమ్ముతండా ప్రాథమిక పాఠశాలలో ఎస్టీ, ఎస్సీ బీసీ పేద విద్యార్థులకు ట్రస్టు ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు.

చిట్యాల, కట్టంగూరు: నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 26, 27వ తేదీల్లో దొడ్డి కొమరయ్య భవన్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు బొడ్డు బాబురావు, వట్టెపాక కృష్ణ కోరారు.

దేవరకొండ: దేవరకొండ మండలం అంబటోనిగూడెంకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త సమడం నిరంజన్ మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం అంబటోనిగూడెంలో అనారోగ్యంతో మృతి చెందిన నిరంజన్ మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరంజన్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

మునుగోడు: మునుగోడు చేనేత సహకార సంఘం ఆధీనంలోని ప్రభుత్వ మిగులు భూమిని అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చేనేత కార్మిక పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగం శివయ్య డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని లేనిచో కార్మికులతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఫస్ట్ ఫ్లోర్‌లో నూతనంగా నిర్మించనున్న కాంప్లెక్స్‌లో దుకాణాలకు పట్టణ, పరిసర ప్రాంత వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ కోరారు. సాగర్‌రోడ్ ఫేస్‌లో దుకాణాలు నిర్మించనున్నందున ఆసక్తి గల వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మర్రిగూడ: ప్రజావాణి ఆర్భాట కార్యక్రమంగా మార్చకుండా నిర్దిష్ట సమయంలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజావాణిని ప్రచార ఆర్భాటంగా మార్చకుండా సమస్యలు పరిష్కరించే వేదికగా ఉండాలని ఆయన కోరారు.

మర్రిగూడ: నెంబర్ ప్లేటు లేని వాహనాలను ఎస్ఐ రంగారెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. మండలకేంద్రంలోని బస్టాండ్‌లో వాహనాలను తనిఖీ చేసి ప్రతీ ఒక్కరూ వాహనాలకు నెంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని, లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది సత్యనారాయణ, యాదగిరి తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామపాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కన్నం సత్తయ్య ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన గైగుల్ల సంతోష్, మర్యాద వెంకన్న గెలుపొందారు. ఎన్నికల అధికారిగా చివుట మల్లయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారిని కాంగ్రెస్ నాయకులు కాంచాని నాగరాజు, గైగుల్ల అవిలయ్య తదితరులు సన్మానించారు.

నల్లగొండరూరల్: ప్రభుత్వం సేకరించిన భూములను ఇళ్ల స్థలాలకు కేటాయించి పేదలకు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని అన్నారు.

శాలిగౌరారం: చెరువు మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. మండలంలోని పెర్కకొండారం గ్రామశివారులో ఉన్న గార్ల చెరువు నుంచి మట్టిని అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా గ్రామానికి తరలిస్తున్నారు. గమనించిన గ్రామస్థులు ట్రాక్టర్లను అడ్డుకొని మట్టి తరలింపును నిలుపుదల చేశారు.

నల్లగొండ: పట్టణంలోని రామగిరి సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించినట్లు తపాలాశాఖ సూపరింటెండెంట్ రఘునాథ స్వామి తెలిపారు. వినియెగదారులు ఆధార్ నవీకరణ, సవరణలు వంటివి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డు కోసం ఉచితంగా దరఖాస్తు చేయనున్నట్లు తెలిపారు.